చెప్పుకునేందుకన్నా యెవరూ లేరు. మంచిచీర చూస్తే నగలు చూస్తే, బొమ్మలుచూస్తే, యెవరికన్నా కొనిపెట్టాలనిపించేది. జబ్బుచేస్తే, యెట్లావుందని పలకరించేవాళ్లు లేరు. ఆపిల్లలు కావాలి కావాలని రాత్రింబవళ్లు అరిచేది హృదయం. వాళ్లలో ఒక్కరన్నా తనసొంతపిల్లలై వుంటారని నిశ్చయించుకున్నాడు. సంగతులన్నీ జ్ఞాపకము తెచ్చుకుని వాళ్ళ ఫోటోలు, తన ఫోటో దగ్గరగా పెట్టుకొని పోలికలు చూసుకుంటాడు. కాని యేంచేస్తాడు? అట్లానే కుళ్లుతో కాలం గడుపుతున్నాడు.

తరువాత నాలుగేళ్ళకి పాపం ఆ రైటరు చచ్చిపోయినాడు. తరవాత రెండునెలల్లో వెంకటబ్రహ్మం సుభద్రా వెంకటబ్రహ్మం ముగ్గురు కొడుకులూ, ఆ రైటరుకి పుట్టిన చంటిపిల్లా అందరు సుఖంగా కాపరంచేస్తున్నారు. వెంకటబ్రహ్మం పెన్షన్ పుచ్చుకుని, ఆపాతయింట్లోనే స్థిరపడ్డాడు. యిప్పుడుకూడా వాళ్లహాల్లో ఆ రైటరుది పెద్ద ఫోటోవుంది. వెంకటబ్రహ్మంగారి ముగ్గురుపిల్లలూ ఆ రైటర్నే బాబాయి అంటారు. ఆ రైటరు కూతురుమాత్రం యీయన్ని 'నాన్నగా' రంటుంది.

## 3. నేనూ, మా ఆవిడా మిగిలాం

### ౧

నేను అందమైనవాణ్ణనిగాని, నా రూపం యింకొకర్ని ఆకర్షిస్తుందనిగాని, నేనెన్నడూ అనుకోలేదు. అనుకోడం అసంభవం.

కాకిపిల్ల కాకికి ముద్దంటారుగాని, మా అమ్మకూడా నాముఖం ఒకటిన్నర నిమిషంకంటె యెక్కువసేపు చూడటం భరించలేక పోయేది. ముద్దుకి దగ్గర చేరనంటే, "కొంచెంసేపు వెళ్లి ఆడుకో నాయనా!" అనేది. యింక బంధువులు సరేసరి. దౌర్భాగ్యురాల్ని చిన్నప్పుడే ఒక పిల్లని నాకు కట్టారుగాని యెదిగింతరవాత నన్నుచూసి యెవతా పెళ్ళిచేసుకునివుండదని నా దృఢ నిశ్చయం. కాని నా భార్యకి తక్కినవాళ్లకి లేని ఒక అదృష్టం కలిగింది. తన భర్త యెంగిలవుతాడనిగాని, తనని మరచిపోయి యితరులవలలో పడతాడనికాని, భయమూ, యీర్ష్యా యేమీ వుండనక్కరలేదు. పెద్ద వుత్సవంలోనైనా నేను మారిపోతాననిగాని, నన్నెత్తుకుపోతారనిగాని, మా అమ్మకే వుండేది కాదు బెంగ. నా మొహం కనపడకపోతేనే చాలునని, నేనడగ్గానే, ఆవూళ్ళోనే బడిపంతులు పనియిచ్చేశాడు, ప్రెసిడెంటు గారు. నేను చదువుకునేప్పుడూ అంతే, చప్పున నన్ను ప్యాసు చేసి పైక్లాసుకి పంపేవారు నా టీచర్లు.

నామీద నిజమైన యిష్టంగలవారు మా హెడ్మాస్టరుగారొక్కరూ. ఆయనయింటికీ మా యింటికీ తాటాకుల దడిమాత్రమే అడ్డం. ఆయనభార్యకి దగ్గరదగ్గిరగా నలభైయేళ్లుంటాయి. ఆమెని చూడగానే పగలబోయే పచ్చని పెద్ద గుమ్మడిపళ్లూ, నిండా దూదికూరిన మెత్తనిదిళ్ళూ, నిండుపాడి గేదెలూ, జ్ఞాపకమొస్తాయి.

౩

అసలు మొదలు ఒకవుదయం. నేను దొడ్లోంచి వాస్తో వుంటే, యెవరో నావంక నిదానంగా చూస్తున్నట్టు, అనుమా

నంతగిలి, వెనక్కి తిరిగిచూస్తే, హెడ్మాస్టరుగారిభార్య రత్తమ్మ గారు కనపడ్డారు. నేనేం తప్పుపని చేశానా. స్నానంచేసిననీళ్లు మళ్ళా వాళ్ళదొడ్లోకివెళ్లాయా, పొద్దున్నే నేను భార్యమీద వేసిన కేకలు వినపడ్డాయా, నా మొహాని అందానికి యింకా యేమన్నా కొత్తఅభివృద్ధి కలిగిందా అనుకుని తలొంచుకుని యింటోకి వెళ్ళి, నాభార్యతో ఆలోచించాను.

"యీవాళేమిటి? మీవంక అట్లా చాలారోజుల్నించి చూస్తోంది."

"ఛా!"

"నిజమే."

"యెందుకు?"

"ఏమో! అడగండి. చెప్పుతీసుకు కొట్టేవాడు లేక!"

హడిలిపోయినాను. వాళ్లువింటే దీని అరుపులు!

"ఛీ! నోరుముయ్యి."

ఇదేమిటి? నా భార్యకికూడా యీర్ష్యేనా! అనుకున్నానుకాని, నా ప్రతాపానికి గర్వంకలక్కపోలేదు. చివరికి నేనుకూడా ఘనతకెక్కాను. కాని నమ్మకం కుదరలేదు. నిజమా? వుత్త దీని అనుమానాలా?

మర్నాటినించి పక్కదొడ్డికేసి అప్రయత్నంగా నాకళ్లు తిరుగుతున్నాయి. నాకేమీ దురుద్దేశమూ లేదు. ఆశా లేదు. వూరికేనే, 'క్యూరియాసిటీ' ఆపుకోలేక చూశాను.

నేను దొడ్లోకి వెళ్ళినప్పుడల్లా అక్కడేవుండేది, బావి దగ్గిర. ఆచూపులా! నావంక చూసే చూపులు, నన్ను లాగెయ్యాలనీ, నన్ను దగ్ధం చెయ్యాలనీ చూస్తున్నట్టుండేవి. నేనే

మనుకోను? నమ్మడం ఎంతయిష్టంలేకపోయినా, యెట్లా నమ్మక తప్పించుకోను? ఆచూపులూ, చిన్నాలు- పన్నాలు పదిహేనేళ్ల పిల్లలోనూ నలభైయేళ్ల స్త్రీలోనూ వొకటే. మొదట నమ్మ లేదు నేను తరవాత నిజమేఅని ఆలోచించాను. నిశ్చయమైన కొద్దీ, నేను కొంచెంసాజ్ఞలు మొదలుపెట్టాను. నేను యోచే స్తున్నానో, యేలోకంలో వున్నానో తెలీదు. నన్నా స్త్రీకో రింది. అందులో దబ్బపండువంటి, అందమైనది, అంతెగొప్పది, హెడ్‌మాస్టరుగారిభార్య! నన్ను! నన్ను!

మెల్లిగా మాటలదగ్గిరికి, వెకిలినవ్వులదగ్గిరికి, దిగులుతో కంటతడిదగ్గిరికీ వొచ్చింది మాస్నేహం! ఐనా నాకింకా అట్లాంటి తలపు లేదు. ధృఢంగా కలగలేదు.

3

అదేంచప్పుడు? మెళుకువ వచ్చింది. నా భార్య చప్పుడు వొంటింటిలో నంటుంది. చప్పుడూ లేదు, యేమీ లేదు నెళ్ళుంటాను, భయంతో. నా ధైర్యాన్ని, మగతనాన్ని గేలిచేసి కఱ్ఱచేతికిచ్చి వెళ్లమంది. కాని తాను కదలదు. చివరకి పోరు పడలేక వంటింటితలుపులుతీసి, లాంతరుతో వెతికాను. యేమీ లేదని దానికి కేకేశాను. "దొడ్డితలుపుకూడా తీసిచూడండి? అరిటిగెల కోసికెళ్లారేమో?" భయంతో వొణుకుతున్న వేళ్లతో తలుపుతీసి చూసేటప్పటికి ముందు తెల్లనిఆకారం కనపడ్డది. అరవడానికికూడా శక్తిలేక నిర్ఘాంతపోయి నుంచు న్నాను. ఆమె కదిలి నన్ను రమ్మని సాజ్ఞచేసిందాకా, రత్తమ్మ గారనుకోలేదు. లాంతరు వొంటింటిలోనే వొదిలి, దొడ్లోకి వెళ్లాను. వెంటనే నన్నుగట్టిగా కావిలించుకుని, మెత్తని తన

శరీరంమీాద నన్ను యిటూఅటూ తిప్పుకుని, వెర్రిప్రేమ అంటో, అట్లాంటివుపకారము చెయ్యకుండా సరిపుచ్చింది, చూపించింది. ఎన్ని నిమిషా లయిందో! "యేమండీ! యేంచేస్తు న్నారు" అన్న అరుపు విని వొదిలేస్సింది. వెళ్లి పక్కమీాద పడుకున్నాను.

౪

నిజంగా, చెపుతున్నా. నాకామెతో యీ సంబంధం మొదట యేమీాయిష్టంలేదు. భయంవేసింది, అసహ్యమేసింది. కాని నావంటివాణ్ణి ఆమె కోరిందనే సంతోషమూ, నాకూ ప్రేమరాజ్యంలో స్థానమిచ్చినందుకు కృతజ్ఞతా, ఆమెమీాద పోలేను. పగలంతా యెంతయిష్టంలేకపోయినా, రాత్రిపన్నెం డుగంటలకి అప్రయత్నంగా మెళుకువవొచ్చి, అప్రయత్నంగా దొడ్లోకి వెళ్లేవాణ్ణి. ఆమె, అంతగొప్పామె నాకోసం కాచు కొనివుంటే—నాకోసం! ఆగగలనా? యింక వెళ్ళింతరువాత ఆమెనన్ను వెర్రిగా భయంకరంగా మోహం చూపి వుపయో గించుకునేది. ఆమె అనుభవానికి ఆరాత్రే గడువున్నట్టూ ఇంక జీవితమేలేనట్టూ నన్ను నలిపేశేది. నాకు మాట్లాడ్డానికిగాని, వూపిరి పీల్చడానికిగాని, కాలు చేతులు కదపటానికిగాని వ్యవ ధానమివ్వదు. యిట్లా అయిదారు రోజులు జరిగింతరవాత ఒకరోజురాత్రి నేను తిరిగి పడుకోటానికి వొచ్చేటప్పటికి నా భార్య మేలుకునివుంది. "యెక్కడికెళ్లారు?"

"చప్పుడవుతోవుంటే వెతకడానికి వెళ్లాను."

"ఆ రత్తమ్మగారేనా చప్పుడుచేసింది?"

చచ్చాను.

"యిదుగో! నే పూరుకోను. నేనూ కనిపెడుతోనే వున్నా. యీవాళ రాత్రి వొచ్చాను. వెనక వేపు గొళ్ళెం వేసుకున్నారు. చిల్లుల్లోనించి కనపళ్ళేదనుకున్నారా వెన్నెట్లో? రేపు పొద్దున్నే అడగన్నూ, ఆ ముండని, యిదేంబుద్ధి అని? తెల్లారనీండి! ఆ మొగు డేమంటాడో?"

యింకేముంది నాగతి! నామీద ఒక్కామెకి లోకములో ప్రేమున్నంటే అదికాస్తా చెడగొట్టేస్తుందా? అంతలో ఆమెయేమనుకుంటుంది? విన్నవాళ్లు నమ్ముతారా? నవ్వరూ? దానికాళ్ళు పట్టుకుని తెల్లవార్లూ బతిమాలి వొప్పించాను. యింకెప్పుడూ ఆమెకోసం వెళ్ళనని నాపితృదేవతలపేర్లు వరసగా చెప్పి, కాళ్ళమీద ప్రమాణాలుచేస్తే అప్పుడు వూరుకుంది.

కాని మర్నాటిరాత్రి మళ్లీ నామనను రత్తమ్మగారి కోసం బాధించడం మొదలుపెట్టింది. నేను కావాలని స్త్రీకోరడం, ఆ ప్రేమ పొందడం, మళ్లీ నాకీజన్మంలో దొరుకుతుందా? కాని యిది! దీన్నెట్లా వొదుల్చుకోడం?

రాత్రులు దొడ్డిదగ్గిర వొకటే చప్పుడు. కిటికీలు, తలుపులు కొట్టడం, గోకడం, నా భార్య నన్ను గట్టిగా కావిలించుకుని వొదలకుండా పడుకుని, చప్పుడువిని వొకటేనవ్వడం. నన్ను రత్తమ్మగారు కోరింతరవాత నా భార్యకి నామీద మోజు కలిగినట్లు తోచింది దీన్ని, దీని మోజునీ, వొదుల్చుకోడమెట్లా! నామెడచుట్టూవున్న చేతులు లాగేసి పీకనొక్కాలన్నంత కోపమొచ్చేది. అసలు దాన్ని చూస్తే నాకు భయం. ముఖ్యం యెక్కడపిల్లని కంటుందో, ఆపిల్ల మొహం చూసినప్పుడల్లా, నాముఖం జ్ఞాపకమొస్తుందేమోనని! దానిపుణ్యమా

అంతవరకు. నాకే పిల్లలుంటే భరించలేక, సన్యసించివుందును. నేను దొడ్లోంచి వెళ్ళినప్పుడల్లా రత్తమ్మగారు జాలిగా నావేపు చూస్తోంది. యేంచెయ్యను యీభార్యని! వాళ్ళఅత్తకి నెప్పులు ప్రారంభమైనాయని, అబద్ధంచెప్పి, సహాయం వెళ్ళమన్నాను. మూడేళ్ళకిందట ఆఅత్తే నారూపాన్ని వెక్కిరించిందనీ, అందువల్ల తాను తనతల్లి మొహం చూడతలుచుకోలేదనీ అంది. వాళ్ల పినతండ్రి పెంపుడుకూతురికి పెళ్ళి అనీ, తనకి మంచి చీరెలు పెడతారనీ, వెళ్లమన్నాను, దొంగశుభలేఖ చూపి. పెళ్లికి వెళ్లడానికి తనకి చీరెలూ, నగలూ లేవంది. అప్పుచేసి బనారసుచీర కొన్నాను. రత్తమ్మగారిని నగలెరువడగమన్నాను. తనకి జ్వరంగా వుందనీ, బైటవుండే రోజులనీ, వెళ్ళనంది.

చివరకి నిజంగానే బైటవుంది. ఆరాత్రి తెగించి తలుపు తీసుకుని దొడ్లోకి వెళ్లాను కాని రత్నమ్మగారు లేదు. మెట్లమీద కూచున్నాను. నామీద, నాపిరికితనంమీద అసహ్యాం పుట్టి వెళ్లిపోయింది. యింకరాదు- యెంత బాధపడ్డదో పాపం! యెంతగొప్ప అనుభవాన్ని, నాపిరికితనంతో పాటు పాడుచేసుకున్నాను. ఆమె దగ్గిర వున్నంతసేపూ వొణుకుతో భయంతో ఆమె మొహమన్నా సరిగాచూసి సంతోషించలేదు. ఈ నా పాడుజన్మకి మళ్ళీ అట్లాంటి అదృష్టం పడుతుందా? ఆనిండు వెన్నెల వొదిలి వెళ్ళి పడుకోటానికి బుద్ధివెయ్యలేదు. ఆనాడే నాకు కొంచెం ధైర్యం కలిగింది. భార్య అరిస్తే బాగా తన్నవొచ్చనిపించింది. చంపెయ్యనా, అన్నంత శౌర్యంకలిగింది. మెల్లిగా దడిదాటి, పక్కదొడ్లోకి వెళ్ళి కిటికీదగ్గిర గోకాను,

ఆమెచేసినట్టే. రెండునిమిషాల్లో మెల్లిగావొచ్చింది, తలుపుతీసుకుని. పల్చనిచీరకిందకనపడే ఆమెమెత్తని పచ్చనివళ్లూ, కాటికపెట్టినపెద్దకళ్ళూ, చిక్కగా వేళ్ళాడేజుట్టూనాకళ్ళుతిప్పేశాయి.

ఆమెని అధికమైన కాపీనంతో కా వి లిం చు కు ని, మామూలుప్రకారం చెట్టుకిందకి వెళ్ళే ఆలోచనన్నా లేక, అరుగుమీదనే నా బరువుతో కూలతోశాను. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం కనపడుతోంది. యిదివరకట్టి మోహము కళ్ళలో వెర్రిని చూపించటం లేదేమోఅనే సందేహంకలగడానికి వ్యవధిలేదు. ఆమెను, అమె గుండ్రతనాన్ని, నాదిగా చేసుకోవాలని ప్రయత్నించాను. ఆ కళ్లలోకి క్రమంగా అసహ్యము తోచింది. నా కింద చలించవలిసిన ఈ మెత్తనిదేహం బిగుసుకుంది. నన్నొక్కతోపుతోసి లేచి నుంచుని, బాధతో, అసహ్యంతో—నావంక రెండుమూడుసార్లు చూసి—"నిన్నా! నిన్నా! నిన్ను! పో, వెళ్లి, పో, ముందు, పో..." యింకా బిగ్గరిగా అరుస్తుందనుకున్నాను. అంత ఆశ్చరంలోనూ బాధలోనూ, నీచత్వంలోకూడా, శక్తితెచ్చుకుని మా యింటితలుపు దగ్గిరికి వెళ్లి ఆగిపొయ్యేఆశతో వెనక్కితిరిగి చూశాను. వెన్నెలకెదురుగా, బాధమూర్తివలె నుంచుని.

"అయ్యో! ఆయన్ని మళ్ళీ యెట్లా ఆయనమొహం చూడను! యేంచెయ్యను?" అని మెల్లిగా అంటూంది. ఆమె మొహం చూసి యింటోకి పరిగెత్తాను భరించలేక.

యెంతసేపు నిద్రపోయినానో! యేడుపులువిని లేచాను. పక్కయింటోకి పరిగెత్తాను. హెడ్మాష్టరుగారి భార్య కాలిపోయింది. హెడ్మాష్టరుగారు నన్నోగదిలోకి పిలిచారు.

"నాతో చెప్పింది అంతా. నీసౌందర్యంచూసి మోహించిందనుకోకు. ఆమెని లోబరుచుకున్న వొక గ్రహం బాధ అట్లాచేసింది. ఆ గ్రహం వొదలగానే ఆమె తెలుసుకున్నది.

అటువంటి పతివ్రతా, నిర్మలచరిత్రా, యీ యుగంలో లేదు. తెలిసిందా! అది యెవరికీ యీసంగతి చెప్పనని గొప్ప వాగ్దత్తం చేయించుకున్నాడు.

మర్నాటినించి నా భార్య అందరితోనూ నన్ను రత్తమ్మగారు కోరిందనీ, తనమీది ప్రేమచాత నేను ఆమెను నిరాకరించాననీ, ఆ వ్యథతో కాల్చుకు చచ్చిపోయిందనీ పుకారు పుట్టించింది. మమ్మల్నిద్దర్నీ రాత్రులు అనుమానంతో చూసిన యిరుగుపొరుగువాళ్లు నిజమేనన్నారు. ఇంక వూరంతా పాకిపోయింది. గోడలమీద 'హెడ్మాష్టరుగారిభార్య యెందుకు పోయింది?' అని రాశారు. నేను నా పనికి రాజీనామా యివ్వడం, నేనూ హెడ్మాష్టరుగారూ మాట్లాడకపోవడం రూఢిపరిచాయి ఆ వార్తని.

హెడ్మాష్టరు విషం మింగి చచ్చిపోయినాడు.

పతివ్రతాతిలకం నా భార్యా, జగన్మోహనాకారుణ్ణి నేనూ, మిగిలాం.